సాక్షి ఒడిశా

బుధవారం । 6 । సెప్టెంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ. 2,62,482

- భువనేశ్వర్/పూరీ



గురుభ్యోనమః

రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు సర్వేపల్లి విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- 8లో.



కాంగ్రెస్‌లోకి హాకీ స్టార్ ప్రబోధ్ టిర్కీ

భారత హాకీ మాజీ కెప్టెన్ ప్రబోధ్ టిర్కీ అధికారికంగా కాంగ్రెస్‌లో మంగళవారం చేరారు. స్థానిక కాంగ్రెస్ భవన్‌లో నిర్వహించిన నిరాడంబర కార్యక్రమంలో ఆయన చేరినట్లు ప్రకటించారు.

- 8లో.

న్యూస్‌రీల్

వర్సిటీని సందర్శించిన ప్రపంచ బ్యాంక్ బృందం



ప్రపంచ బ్యాంక్ బృందంతో వర్సిటీ అధ్యాపకులు

బరంపురం: నగరానికి సమీపంలోని బంజవిహార్‌లో ఉన్న బరంపురం యూనివర్సిటీని ప్రపంచ బ్యాంక్ తరఫున ఆరుగురు సభ్యుల బృందం మంగళవారం సందర్శించింది. ఈ బృందంలో ప్రపంచ బ్యాంక్‌కి చెందిన డెన్నిస్ నికాలబ్, సంగీత పలా, సంగీత దేవ్, పపియా బంగరాజ్యా, రాజీవ్ అగ్రావల్, మోనిక చావ్‌లాలు ఉన్నారు. వర్సిటీ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి అందుతున్న నిధుల వినియోగంపై ఆరా తీశారు. వీసీ ప్రొఫెసర్ గీతాంజలీ దాస్ ప్రపంచ బ్యాంక్ బృందానికి సహకరించారు. కేంద్ర సాయంతో అమలవుతున్న పథకాలపై అధ్యయనం చేశారు.

వ్యాన్ బోల్తా.. ఐదుగురికి గాయాలు



బోల్తా పడిన పికప్ వ్యాన్

పర్లాకిమిడి: రాయఘడ బ్లాక్ సేవక్‌పూర్ వద్ద మంగళవారం సాయంత్రం ఒక పికప్ వ్యాన్ జాతీయ రహదారిపై బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఐదుగురు కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు పర్లాకిమిడి ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. వ్యానులో సిమెంట్, ఇటుకల లోడు ఉంది. సేవక్‌పూర్ నుంచి రాయఘడ బ్లాక్ కేంద్రానికి వెళ్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని వాహనాన్ని పక్కకు తీశారు.

పిడుగుపాటుకు బాలుడు మృతి



తపన్ మృతదేహం

రాయగడ: జిల్లాలో కాసీపూర్ సమితి కుచేయిపాదొరొ పంచాయతీలోని కుచేరి గ్రామంలో సోమవారం పిడుగుపాటుకు బాలుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన తపన్(13) సమీపంలోని కొండపైకి ఆవులను మేతకు తీసుకెళ్లాడు. సాయంత్రం కావడంతో ఆవులను తోలుకుంటూ ఇంటికి వెళ్లేందుకు సిద్ధపడేలోగా, భారీగా వర్షం కురవడంతో ఒక చెట్టు కిందికి వెళ్లి తలదాచుకున్నాడు. అదే సమయంలో ఉరుములతో కూడిన వర్షంతో పాటు చెట్టుపై పిడుగు పడటంతో చెట్టుకింద ఉన్నటువంటి తపన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఇదిలా ఉండగా కాసీపూర్ సమితిలోని డికొరల్, కుచేయిపాదొరొ గ్రామాల్లో పిడుగు పడి మూడు ఆవులు మృతి చెందాయి. బాలుడి మృతదేహాన్ని టికిరి పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం టికిరి పీహెచ్‌సీకి తరలించారు.

గజరాజుల కళేబరాలు స్వాధీనం



గుర్తించిన ఏనుగు కళేబరం

భువనేశ్వర్: అంగుల్ జిల్లా సతొకొషియా వన్య ప్రాణుల అభయారణ్యంలో రెండు ఏనుగుల కుళ్లిపోయిన కళేబరాలను అటవీ శాఖ సిబ్బంది మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. స్థానిక గ్రామస్తులు అటవీ పరిధిలోని జగన్నాథ్‌పూర్ గ్రామ సమీపంలో ఈ కళేబరాలను గుర్తించారు. హైటెన్షన్ లైవ్ వైర్ తగిలి విద్యుదాఘాతానికి గురై ఏనుగులు చనిపోయినట్లు భావిస్తున్నారు. దాదాపు నాలుగు రోజుల క్రితమే ఏనుగులు మృతి చెందినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలం ప్రత్యక్షంగా సందర్శించి మృతి చెందిన రెండు ఏనుగుల కుళ్లిన కళేబరాలను స్వాధీనం చేసుకొని పరిస్థితులపై విచారణ చేపట్టారు. ఈ రెండు వన్య ప్రాణులు లైవ్ విద్యుత్ తీగకు తగిలి చనిపోయాయని అనుమానిస్తున్నప్పటికీ ఖచ్చితమైన కారణాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. నాలుగు రోజుల క్రితం విద్యుదాఘాతానికి గురై జంతువులు మృతి చెందినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. అటవీశాఖ అధికారులు, వైద్య బృందం కళేబరాలను పరిశీలిస్తున్నారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

అలజడి

- అల్పపీడనం ప్రభావంతో ఎగసిపడుతున్న కెరటాలు
- అర్జిపల్లిలో మత్స్యకారుల పడవ బోల్తా

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో సముద్రంలో కెరటాలు ఎగసిపడుతున్నాయి. ఉత్తర బంగాళాఖాతం అండమాన్ దీవిలో ఏర్పడిన అల్పపీడనం గోపాల్‌పూర్ తీరంవైపు కదులుతోంది. ఇది మరో 24 గంటల్లో ఉత్తరాంధ్ర మరియు దక్షిణ ఒడిశా సముద్ర తీరానికి తాకుతూ బలహీనపడుతుందని గోపాల్‌పూర్ వాతావరణ పరిశోధన కేంద్రం తెలియజేసింది. అయితే తీరానికి వాయుగుండం చేరువతున్న సమయంలో విపరీతంగా వర్షాలు కురుస్తున్నాయి.



గోపాల్‌పూర్ తీరంలో కురుస్తున్న వర్షాలు

అలాగే కెరటాల ప్రభావంతో అర్జిపల్లి తీరంలో మత్స్యకారుల పడవ మంగళవారం బోల్తా **పడింది. పడవలో ఉన్నటువంటి 10 మంది అతి** కష్టం మీద ఒడ్డుకు చేరుకున్నారు. - బరంపురం



మేఘావృతమైన అర్జిపల్లి తీరం



అర్జిపల్లి తీరంలో బోల్తాపడుతున్న పడవ



పడవతో పాటు సముద్రంలో మత్స్యకారులు



అలల తాకిడితో అప్రమత్తమవుతున్న మత్స్యకారులు

చినుకు సవ్వడి



నగరంలో కురుస్తున్న వర్షం

- బరంపురంలో కుంభవృష్టి
- అల్పపీడనం ప్రభావంతో భారీవర్షం



అల్పపీడనం ప్రభావంతో చినుకు సవ్వడి మొదలై ఇటీవల కొనసాగుతున్న ఉక్కపోతకు ఫుల్‌స్టాప్ పడింది. మంగళవారం బరంపురం నగరంలో దాదాపు 2 గంటల పాటు కుంభవృష్టిగా వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కాలువల నుంచి వర్షపు నీరు రహదారులపై ప్రవహించడంతో వీధులు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. స్థానిక ప్రేమ్‌నగర్, నీలాంచల్ నగర్, గజపతి నగర్, లంజిపల్లి, హారదాఖండి, ధర్మనగర్, గాంధీనగర్, టాటా బంజ్ జంక్షన్లలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. - బరంపురం



వర్షంలోనే ప్రయాణం చేస్తున్న వాహనదారులు



లంజిపల్లిలో వర్షపు నీటిలో ట్రాక్టర్లు



అస్కా రోడ్‌లో జలమయమైన రోడ్లు

కొత్త న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారం



హైకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న శివ శంకర్ మిశ్రా

- హైకోర్టులో 22కి చేరిన న్యాయమూర్తులు

భువనేశ్వర్: రాష్ట్ర హైకోర్టులో ఇద్దరు కొత్త న్యాయమూర్తులు జస్టిస్ శివశంకర్ మిశ్రా, జస్టిస్ ఆనంద్ చంద్ర బెహరాలు మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుభాషిస్ తలపత్ర వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు. వీరివురి నియామకంతో హైకోర్టులో మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 22కి చేరింది. ఈ ఏడాది ఆగస్టులో సుప్రీంకోర్టు కొలీజియం ఒడిశా హైకోర్టులో న్యాయమూర్తులుగా నియామకం కోసం న్యాయవాది శివ శంకర్ మిశ్రా, న్యాయ అధికారి ఆనంద చంద్ర బెహరా పేర్లను సిఫారసు చేసింది.

శివశంకర్ మిశ్రా

శివశంకర్ న్యాయవాదిగా 30 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం కలిగి ఉన్నారు. ఒడిశా ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టులో అడ్వకేట్-ఆన్-రికార్డ్‌గా కొనసాగారు. శివ శంకర్ మిశ్రా మిశ్రా అండ్ అసోసియేట్స్ వ్యవస్థాపకుడు మరియు సుప్రీంకోర్టు, ఢిల్లీ హైకోర్టు మరియు ఇతర హైకోర్టుల్లో మధ్యవర్తిత్వం



ఆనంద్ చంద్ర బెహరాతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శుభాషిస్ తలపత్ర

, క్రిమినల్, సివిల్, సర్వీస్ మరియు రెవెన్యూ వ్యవహారాలకు సంబంధించిన వివిధ చట్టాలకు సంబంధించిన కేసులకు స్వతంత్రంగా హాజరై వాదించారు. 150కి పైగా కేసుల్లో ఆయన హాజరయ్యారు. అతను నేషనల్ కన్జ్యూమర్ డిస్ప్యూట్స్ రిడ్రెసల్ కమిషన్, ఎన్‌సీఎల్‌టీ, ఎన్‌సీఎల్ఏటీ, డెట్ రికవరీ ట్రిబ్యునల్స్, విద్యుత్ శాఖ అపిలేట్ ట్రిబ్యునల్, జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ), పీఎంఎల్ఏ, ఢిల్లీలోని ట్రయల్ కోర్టులు మరియు ఇతర ప్రత్యేక కోర్టులు, జ్యూడీషియల్ మరియు క్వాసీ జ్యూడీషియల్ న్యాయ స్థానాల్లో కేసులను నిర్వహించారు. రామ జన్మభూమి కేసులో దాఖలైన ఐదు దావాలలో ఒకరైన పిటిషనర్ జస్టిస్ దేవకి నందన్ అగర్వాల్‌కు ఆయన సహాయకునిగా వ్యవహరించారు. ఆయన మే 3, 1968న జయపురంలో జన్మించారు. కొరాపుట్ జిల్లా జయపురం న్యాయ కళాశాలలో ఎల్ఎల్‌బీ పట్టా పొందారు. 1991లో న్యాయవాద వృత్తిని చేపట్టారు.

ఆనంద్ చంద్ర బెహరా

ఆనంద్ చంద్ర బెహరా ఒడిశాలోని పలు ప్రాంతాల్లో న్యాయశాఖ అధికారిగా పనిచేశారు. అతను మంచి వ్యక్తిగత మరియు వృత్తిపరమైన ఇమేజ్ కలిగి ఉన్నారు. ఆయన మే 23, 1964న బాలాసోర్‌లో జన్మించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సీనియర్ న్యాయశాఖ అధికారిగా సేవలందించారు. అతను సివిల్ మరియు క్రిమినల్ కేసులను పరిష్కరించడంలో ప్రావీణ్యం కలిగి ఉన్నాడు. 2004 సంవత్సరంలో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు న్యాయమూర్తిగా పని చేశారు. 2013 సంవత్సరంలో జిల్లా జడ్జి రెగ్యులర్ కేడర్‌లో చేరారు. కటక్, భువనేశ్వర్, సుందర్‌గఢ్, రౌర్కెలా, ధర్మగఢ్, జగత్‌సింగ్‌పూర్ మరియు బరంపురం అదనపు జిల్లా న్యాయమూర్తిగా పని చేశారు. వీరివురి నియామకంతో రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానంలో 33 మంది న్యాయమూర్తుల స్థానంలో 22 న్యాయమూర్తి పదవులు భర్తీ అయ్యాయి. అయితే ఈ ఏడాది సెప్టెంబర్ 6న జస్టిస్ బిశ్వనాథ్ రథ్, అక్టోబర్ 3న ప్రధాన న్యాయమూర్తి పదవీ విరమణ చేసిన తర్వాత మళ్లీ రాష్ట్ర హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 20కి పడిపోయే అవకాశం ఉంది.

సాంకేతిక పద్ధతులు అవలంబించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ సింగ్, వేదికపై గుప్తా, శారద, గోవిందరావు తదితరులు

- కలెక్టర్ స్వాదాదేవ్ సింగ్
- ఎంఎస్‌ఎంఈల సెమినార్

రాయగడ: పరిశ్రమల్లో ఆధునిక సాంకేతిక పద్ధతులు అవలంభించాలని కలెక్టర్ స్వాదాదేవ్ సింగ్ అన్నారు. స్థానిక హోటల్ తేజస్విని సమావేశ మందిరంలో సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ (కటక్)ఆధ్వర్యంలో సెమినార్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ పరిశ్రమ యజమాని తన పరిశ్రమల్లో ఉత్పత్తి అవుతున్న వస్తువులు కొనుగోలుదారులకు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకుంటే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఉత్పత్తి చేస్తున్న ప్రతీ వస్తువుపై కొనుగోలుదారులకు అవగాహన కలిగేలా డిజిటల్ మాధ్యమాల్లో ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రగతికి ప్రభుత్వం ఎంతగానో ప్రోత్సాహిస్తుందని, దీనికి సంబంధించి అందిస్తున్న సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పరిశ్రమల ఏర్పాటుతో ఎంతోమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు ఇటువంటి తరహా సెమినార్‌లు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఎంఎస్‌ఎంఈ జాయింట్ డైరెక్టర్ ప్రఫుల్ల కుమార్ గుప్తా మాట్లాడుతూ ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నటువంటి చిన్న తరహా పరిశ్రమలపై యువత ఆసక్తి కనబరచాలన్నారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్తలు ఎ.గోవిందరావు, యుసీసీఐఎల్ (భువనేశ్వర్) కార్యదర్శి ఎ.కె.శారద, డీఐసీ జీఎం వికాష్ చంద్ర బైస్ తదితరులు పాల్గొన్నారు.



సెమినార్‌లో పాల్గొన్న వివిధ పరిశ్రమల యజమానులు

బస్సు సౌకర్యం కల్పించండి



తెలుగు ప్రజలతో ఎంపీ రమేష్‌చంద్ర మఝి, ఎమ్మెల్యే సదాశివ ప్రధానిలు

- తెలుగు ప్రజల విజ్ఞప్తి

కొరాపుట్: పార్వతీపురం-నబరంగ్‌పూర్‌ల మధ్య ఓఎస్ఆర్టీసీ బస్సు నడపాలని తెలుగు ప్రజలు కోరుతున్నారు. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని సర్క్యూట్ హౌస్‌లో నబరంగ్‌పూర్ పార్లమెంట్ సభ్యుడు రమేష్ చంద్ర మఝి, నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రధానీలు తెలుగు ప్రజలతో ప్రత్యేక సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే చెప్పాలన్నారు. దీంతో తెలుగు ప్రజల తరుపున ఉన్న చక్రధర్‌రావు, వారణాసి రమేష్‌లు మాట్లాడుతూ.. తమకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. సుమారు 300 కుటుంబాలకు ఇరువైపులా బంధువులు ఉన్నారని తెలియజేశారు. వెంటనే ఎంపీ స్పందిస్తూ తాను గతంలో రాష్ట్ర రవాణా శాఖా మంత్రిగా పనిచేశానని తెలిపారు. సమస్యపై తానే స్వయంగా భువనేశ్వర్‌లో ట్రాన్స్‌పోర్టు ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరలో బస్సు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. అలాగే తెలుగు ప్రజలు అత్యధికంగా ఉండే చైనా మార్కెట్‌లో షిర్డీసాయి మందిర మరమ్మతులకు నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రదాని గతంలో రూ.3 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారు. కమిటీ తరుపున అమనాన సింహాచలం, మాదేటి కృష్ణ స్పందిస్తూ తమకు మరో రూ.3 లక్షలు కావాలని కోరారు. దీతో తన కోటా నిధుల నుంచి వీలైనంత త్వరలో మరో రూ.3 లక్షలు ఇస్తామని ఎంపీ హామీ ఇచ్చారు. సాహిల్ హోటల్ ప్రాంతంలో ఉన్న టాటా శ్రీను గురుస్వామి, సన్నిదానం స్వాములు కలిసి తమ పూర్వ సమస్య విన్నవించారు. దీంతో వారికి గతంలో తను ఇస్తామన్న రూ.2 లక్షలు వెంటనే మంజూరు చేస్తామన్నారు. మైత్రి విహార్ మెదటి లైన్‌లో అసంపూర్తిగా ఉన్నటువంటి రోడ్డును పూర్తి చేయాలని కోరాడ శంకరరావు, పొట్నూరు భీమారావు విజ్ఞప్తి చేయగా, వెంటనే మున్సిపల్ ఈవోకి ఫోన్‌చేసి, రోడ్డు పనులకు సంబంధించి ఈనెలాఖరులోపు టెండర్ పని పూర్తి చేయాలని ఆదేశించారు.

భారీగా గంజాయి స్వాధీనం



కొరాపుట్: స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు

కొరాపుట్: జిల్లాలోని పొట్టంగి పోలీసులు భారీగా గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మంగళవారం కొరాపుట్ జిల్లా పొట్టంగి పోలీసుస్టేషన్ పరిధిలోని సంబాయి-సునాబెడా రిజర్వ్ ఫారెస్టు పరిధిలో గంజాయి రవాణా జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో పోలీసులు ఆ ప్రాంతంలో తనిఖీలు చేపట్టారు. ఒక రహస్య ప్రాంతంలో 12 గంజాయి బస్తాల్లో ఉంచిన 463 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనిపై పొట్టంగి ఎస్ఐ ప్రదీప్ కుమార్ మహాపాత్రో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



జయపురం: గంజాయితో పట్టుబడిన నిందితులు

జయపురం: ఒక స్కూటీలో అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి తెలియజేశారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. సోమవారం రాత్రి 26వ నంబర్ జాతీయ రహదారిలో సదర్ పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. ఆ సమయంలో కుములిపుట్ గ్రామ సమీపంలో ఒక స్కూటీ వస్తుండగా సబ్‌ఇన్‌స్పెక్టర్ ఎస్.కె.టొప్పొ అనుమానంతో ఆపారు. స్కూటీని తనిఖీ చేయగా అందులో పది గంజాయి ప్యాకెట్లు కనుగున్నారు. దీంతో స్కూటీపై వస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. అరెస్టైన వ్యక్తులు నవరంగపూర్ జిల్లా తెంతులికుంటి పోలీసు స్టేషన్ పరిధి మెరనాస్ కొత్తవీధికి చెందిన ఖగుపతి హరిజన్, ధనుర్జయ హరిజన్‌లుగా పోలీసులు వెల్లడించారు. పట్టుబడిన 40 కేజీల గంజాయి విలువ సుమారు రూ.4 లక్షలు ఉంటుందని వెల్లడించారు. నిందితులు గంజాయిని మాఛఖండ్ పోలీసుస్టేషన్ పరిధి లమతాపుట్ ప్రాంతంలో ఖరీదు చేసి ఛత్తీష్‌ఘడ్ రాష్ట్రంలోని రాయ్‌పూర్‌కు తరలిస్తున్నారని పేర్కొన్నారు.

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్య

కురుపాం: ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ప్రేమకు ప్రతిరూపంగా ఇద్దరు పిల్లలను కన్నారు. ఇలా సంతోషంగా ఉండగానే ఇటీవల వారి మధ్య కుటుంబ కలహాలు మొదలయ్యాయి. ఎప్పటిలాగానే కోపంతో ఉన్న ఇద్దరూ మాటకు మాట అనుకున్నారు. ఇంతలోనే వివాహిత క్షణికావేశంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఈ విషాద సంఘటనపై ఎల్విన్‌పేట్ సీఐ సత్యనారాయణ, కురుపాం ఎస్సై సీహెచ్. ప్రసాదరావు తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. పూతికవలస ఎస్సీ కాలనీకి చెందిన మండంగి దుర్గాప్రసాదరావు శ్రీకాకుళం జిల్లా పోలాకి మండలానికి చెందిన ఎం.సంధ్య (24)ను ప్రేమించి వివాహం చేసుకున్నాడు ఇద్దరి మధ్య గొడవల కారణంగా సంధ్య ఇంట్లో ఉరి వేసు కుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే కురుపాం ఎస్సై, ఎల్విన్‌పేట సీఐ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తికి గాయాలు

రణస్థలం: మండలంలోని నెలివాడ జాతీయ రహదారి పైవంతెనపై సోమవారం రాత్రి 9గంటల సమయంలో వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి గాయపడినట్లు జేఆర్ పురం ఎస్‌ఐ జి.రాజేష్ తెలిపారు. వెంటనే క్షతగాత్రుడిని 108లో శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తరలించి వైద్యం అందజేశారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్ కు మంగళవారం తరలించారు. ప్రస్తుతం అతను అపస్మారక స్థితిలో ఉన్నాడు. ఈ ప్రమాదంపై జేఆర్ పురం ఎస్‌ఐ జి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

గుండె చెరువైంది


మిత్తాన కామేశ్వరరావు


గిన్ని రాజేశ్వరి

సంతబొమ్మాళి: మండలం హనుమంతునాయుడుపేట పంచాయతీ పోతునాయుడుపేటలో మంగళవారం విషాదం చోటు చేసుకుంది. చెరువులో మునిగి తండ్రీకూతుళ్లు మృతి చెందడంతో ఊరు మూగబోయింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మిత్తాన కామేశ్వరరావు (66) కౌలుకు తీసుకున్న పొలానికి నీరు పెట్టేందుకు మంగళవారం పంపుసెట్టుతో వెళ్లారు. కామేశ్వరరావు చిన్న కుమార్తె గిన్న రాజేశ్వరి(46) కూడా తండ్రికి సాయం చేసేందుకు వెళ్లారు. గట్టుపైన పంపుసెట్టు పెట్టి పైపును నీటిలో ఉంచేందుకు కామేశ్వరరావు చెరువులో దిగారు. అయితే చెరువులోని తీగలు కాలికి చుట్టుకోవడంతో బయటకు రాలేక మునిగిపోయాడు. తండ్రిని కాపాడుదామని రాజేశ్వరి కూడా చెరువులో దిగారు. కానీ ఆమె కాలికి కూడా తీగలు చుట్టుకోవడం, అక్కడ లోతు ఎక్కువగా ఉండడంతో ఇద్దరూ బయటపడలేకపోయారు. సమయానికి సాయం చేసేందుకు కూడా ఎవరూ లేకపోవడంతో తండ్రీకూతుళ్లు ప్రాణాలు కోల్పోయారు. పొలానికి వెళ్లిన వారు ఎంతసేపటికీ రాకపోవడంతో కామేశ్వరరావు భార్య అనసూయమ్మ గ్రామస్తులతో కలిసి చుట్టుపక్కల ప్రాంతాల్లో, చెరువుల్లో సుమారు గంటసేపు గాలించారు. ఈ క్రమంలో నీటిలో మునిగి ఉన్న తండ్రీకూతుళ్ల మృతదేహాలను గ్రామస్తులు చూసి వెలికి తీశారు. సమాచా రం అందుకున్న నౌపడ ఎస్‌ఐ కిశోర్ వర్మ సిబ్బందితో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలకు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం టెక్కలి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మత్యువాత పడడంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. కామేశ్వరరావుకు భార్య అనుసూయ మ్మ నలుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. రాజేశ్వరి అతనికి నాలుగో కుమార్తె. రాజేశ్వరి భర్త రెండేళ్ల కిందట మృతి చెందారు. రాజేశ్వరి కుమారుడు మధు విదేశాల్లో ఉండగా మరొక కుమారుడు ఇంటర్ పూర్తి చేశాడు.

గుర్తు తెలియని జంతువు దాడిలో మేక పిల్లలు మృతి


జంతువు దాడిలో మరణించిన మేకపిల్లలు

మందస: మండలంలో గుర్తు తెలియని జంతువు దాడి కొనసాగుతోంది. ఉద్దానంలో అలజడి సృష్టించిన ఈ జంతువు గిరిజన ప్రాంతానికి చేరుకుంది. బుడారిసింగి పంచాయతీలో సంచరిస్తున్న గుర్తు తెలియని జంతువు ఇదే పంచాయతీలోని పద్మాపురం గ్రామంలో సుమారు 10 మేక పిల్లలను చంపేసింది. పురుషోత్తం దొళాయి అనే పెంపకందారుడు సోమవారం రాత్రి తన మేక పిల్లలను పశువుల శాలలో ఉంచాడు. మంగళవారం ఉదయం చూసేసరికి 10 మేకపిల్లలు జంతువు దాడికి గురై మరణించినట్టు గుర్తించాడు. ఇంటి వద్దే మేక పిల్లలు మరణించడంతో పురుషోత్తం కన్నీటి పర్యంతమయ్యాడు. అధికారులు స్పందించి, నష్టపరిహారం ఇప్పించాలని కోరాడు. గుర్తు తెలియని జంతువు దాడిపై పాడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


జయపురం: ప్రాథమిక పాఠశాలలో సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం


మల్కన్‌గిరి: ఉత్తమ ఉపాధ్యాయులకు చెక్‌లు అందజేస్తున్న కలెక్టర్ విశాల్ సింగ్


జయపురం: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

గురుభ్యోనమః

● ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం ● సర్వేపల్లి విగ్రహాలు, చిత్రపటాలకు ఘన నివాళులు


మల్కన్‌గిరి: విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు

భారత ప్రథమ ఉప రాష్ట్రపతి, రెండో రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకుని, ఉపాధ్యాయ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు సర్వేపల్లి విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. అజ్ఞానమనే అంధకారాన్ని పారద్రోలి, విజ్ఞానమనే వెలుగును ప్రసాదించే వారే గురువులని, అటువంటి మహోన్నతులను సన్మానించుకోవడం బాధ్యత, అదృష్టంగా భావించాలని వక్తలు తెలిపారు.

– సాక్షి నెట్‌వర్క్


మల్కన్‌గిరి: ప్రశంసా పత్రాలతో ఉత్తమ ఉపాధ్యాయులు


జయపురం: అప్పర్ కొలాబ్ ప్రాజెక్టు ఉన్నత పాఠశాలలో గురుపూజోత్సవం


పర్లాకిమిడి: పతంజలి యోగా కేంద్రంలో గురువును సన్మానిస్తున్న శిష్యబృందం


కొరాపుట్: ఉమ్మరికోట్‌లో హారతులిస్తున్న విద్యార్థినులు


పర్లాకిమిడి: టీచర్స్ డే సందర్భంగా గురువులను సన్మానించుకుంటున్న విద్యార్థులు


పర్లాకిమిడి: మహారాజా బాలుర ఉన్నత పాఠశాలలో టీచర్లను గౌరవిస్తున్న విద్యార్థులు


పర్లాకిమిడి: ఎస్‌కేసీజీ కళాశాల పతంజలి యోగా శిక్షణ కేంద్రంలో గురు దివాస్


పర్లాకిమిడి: మహారాజా బాలుర ఉన్నత పాఠశాలలో గురువులను సన్మానించుకుంటున్న విద్యార్థులు

కాంగ్రెస్‌లోకి హాకీ స్టార్ ప్రబోధ్ టిర్కీ


టిర్కీని పార్టీలోకి ఆహ్వానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

భువనేశ్వర్: భారత హాకీ మాజీ కెప్టెన్ ప్రబోధ్ టిర్కీ అధికారికంగా కాంగ్రెస్‌లో మంగళవారం చేరారు. స్థానిక కాంగ్రెస్ భవన్‌లో నిర్వహించిన నిరాడంబర కార్యక్రమంలో ఆయన చేరినట్లు ప్రకటించారు. ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(ఓపీసీసీ) అధ్యక్షుడు శరత్ పట్నాయక్, రాష్ట్ర శాఖ వ్యవహారాల ఇన్‌ఛార్జి డాక్టర్ ఎ.చెల్లకుమార్, రాష్ట్ర యూనిట్ ప్రచార కమిటీ చైర్మన్ బిజయ్ కుమార్ పట్నాయక్ మరియు ఓపీసీసీ మాజీ అధ్యక్షుడు నిరంజన్ పట్నాయక్ సమక్షంలో పార్టీలో చేరారు. ప్రబోధ్ టిర్కీతో పాటు బిజూ జనతాదళ్ (బీజేడీ) భువనేశ్వర్ ఆర్గనైజేషనల్ జిల్లా మాజీ కార్యదర్శి ప్రశాంత చంపతితో సహా పలువురు ప్రముఖులు కాంగ్రెస్‌లో చేరారు.

రాహుల్ గాంధీ పనితీరును మెచ్చి...


రాహుల్ గాంధీ పనితీరు తనని తీవ్రంగా ప్రభావితపరచి స్ఫూర్తిగా నిలిచిందని, ఆ ప్రేరణతో కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నట్లు ప్రబోధ్ టిర్కీ తెలిపారు. ఆదివాసీలు అధికంగా ఉండే సుందర్‌గడ్ జిల్లాలోని బలిశంక్ర మండలం పరిధి లుల్కిడిహి గ్రామానికి చెందిన ప్రబోధ్ త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తాలాసార నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు ఆసక్తిగా ఉన్నట్లు పేర్కొనడం విశేషం. గిరిజనులకు ప్రభుత్వ పథకాలు అందకపోవడంతో తమ ప్రాంత ప్రజలు నిర్లక్ష్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంత ప్రజలకు సేవ చేసి, అభివృద్ధికి పాటుపడేందుకు తాలాసార నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు.

టిర్కీ నేపథ్యం

అక్టోబర్ 6, 1984న జన్మించిన ప్రబోధ్ 2000 సంవత్సరంలో జూనియర్ ఆసియా కప్‌తో హాకీలో అరంగేట్రం చేశాడు. అతను సబ్–జూనియర్, జూనియర్ మరియు ఇండియా–ఏ జట్లకు కెప్టెన్‌గా సారథ్యం వహించాడు. అంచెలంచెలుగా ఈ రంగంలో ఎదిగి భారత్ సీనియర్ జట్టు కెప్టెన్‌గా బాధ్యతలను విజయవంతంగా నిర్వహించాడు. 2007లో చెన్నైలో జరిగిన ఆసియా కప్‌ను గెలుచుకున్న భారత జట్టులో ప్రతిభ ప్రదర్శించాడు. అతను మొత్తం 135 అంతర్జాతీయ ప్రదర్శనల్లో విశేష గుర్తింపు సొంతం చేసుకున్నాడు. 2001 సంవత్సరంలో ఏకలవ్య పురస్కారం మరియు 2009లో బిజూ పట్నాయక్ స్టేట్ స్పోర్ట్స్ అవార్డుతో ప్రత్యేక సత్కారం పొందాడు.

ట్రాక్టర్ బోల్తా.. ఐదుగురికి గాయాలు

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి హంతాళ్‌గూడ ఘాటీలో మంగళవారం ఒక ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. మామిడి ప్రాంతం నుంచి చిత్రకొండకు కన్‌బేడ గ్రామానికి చెందిన గురుభేముండు, దేవంబట్ అనే ఇద్దరు వ్యక్తులు ట్రాక్టర్‌లో కలిసి వస్తున్నారు. అయితే ఘాటీలో ట్రాక్టర్ బరువు తగ్గడంతో ఒక్కసారిగా బోల్తా పడిపోయింది. గాయపడినవారిని సమీపంలో ఉన్న బీఎస్ఎఫ్ జవాన్లు బయటకు తీసి హంతాళ్‌గూఢ బీఎస్ఎఫ్ క్యాంప్‌లో ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం చిత్రకొండ ఆరోగ్య కేంద్రానికి తరలించారు.


గాయపడినవారికి చికిత్స అందజేస్తున్న జవాన్లు

నూతన క్యాంపస్‌కు స్థలం కేటాయింపు


ప్రస్తుత విక్రమదేవ్ వర్సిటీ భవనం

జయపురం: స్థానిక విక్రమదేవ్ విశ్వవిద్యాలయం నూతన క్యాంపస్ నిర్మాణానికి స్థలం కేటాయింపు జరిగింది. ఆగస్టు 2వ తేదీన ఓఎస్‌హెచ్‌ఈసీ(ఒడిశా రాష్ట్ర ఉన్నత విద్యా కౌన్సిల్) ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ అశోక్ కుమార్ దాస్, అకాడమిక్ అధికారి ప్రొఫెసర్ మిహిర కుమార్ దాస్, ఉన్నత విద్యా విభాగ ప్రత్యేక కార్యదర్శి రమాకాంత నాయిక్ జయపురం వచ్చి పరిసర ప్రాంతాల్లో 5 స్థలాలను పరిశీలించిన విషయం పాఠకులకు విదితమే. ఆనాడు అధికారులతో వర్సిటీ రిజిస్ట్రార్ డా.గోపాల హవల్దార్, అప్పటి జయపురం సబ్ కలెక్టర్ బేదబర ప్రధాన్, జయపురం తహసీల్దార్ సాగరిక షాడంగి తదితరులు స్థలాలను పరిశీలించారు. వాటిలో జయపురం సమితి రొండాపల్లిలో 73 ఎకరాల స్థలం ఎంపిక చేసినట్లు రాష్ట్ర ఉన్నత విద్యా విభాగం నుంచి వర్సిటీ అధికారులకు లేఖ అందినట్లు విక్రమదేవ్ వర్సిటీ రిజిస్ట్రార్ డా.గోపాల హవల్దార్ వెల్లడించారు. ఆ స్థలంపై రికార్డ్స్ ఆఫ్ రైట్స్ కోసం జయపురం తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేయడం జరుగుతుందని వెల్లడించారు. రెవెన్యూ విభాగం అవసరమైన చర్యలు చేపట్టిన అనంతరం ఆ స్థలం అలైన్‌మెంట్ అవుతుందని వెల్లడించారు.

‘నాణ్యమైన విద్య అందరికీ అందాలి’


కళాశాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ సింగ్

రాయగడ: వెనుకబడిన జిల్లాగా గుర్తింపు పొందిన రాయగడలో అందరికీ నాణ్యమైన విద్య అందేలా విద్యాసంస్థలు కృషి చేయాలని కలెక్టర్ స్వాదాదేవ్ సింగ్ సూచించారు. స్థానిక సాయిప్రియ నగర్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన సిటీ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ సైన్స్ విద్యాసంస్థను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రైవేటు విద్యాసంస్థలు ఏర్పాటు చేయడం తప్పుకాదని, అయితే ఉన్నత విద్యను అభ్యసించేందుకు వచ్చేవారికి మెరుగైన సౌకర్యాలు కల్పించి వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేసేందుకు కృషి చేయాలని సూచించారు. జిల్లాలో అత్యధిక శాతం మంది ఆదివాసీ, హరిజనులు నివసిస్తున్న తరుణంలో విద్యార్థుల ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా సహకరించాలని కోరారు. అనంతరం స్మార్ట్ తరగతి గదులు, గ్రంథాలయం, తరగతి గదులను పరిశీలించారు. విద్యాసంస్థ చైర్మన్ ఆశిష్ కుమార్ నాయక్ మాట్లాడుతూ తమ కళాశాలలో ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్, బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (బీసీఏ), బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ ఎడ్మినిస్ట్రేషన్ (బీబీఏ) వంటి కోర్సులను ప్రారంభించామన్నారు. కార్యక్రమంలా స్థానిక సెంచూరియన్ కళాశాల డైరెక్టర్ రాజేష్ పాఢి, జెమ్స్ విద్యాసంస్థ చైర్మన్ ఏపీఎస్ గిరి తదితరులు పాల్గొన్నారు.

మరచిపోయిన ల్యాప్‌టాప్ అందజేత

భువనేశ్వర్: రైలు ప్రయాణంలో చేజార్చుకున్న ల్యాప్‌టాప్‌ను సంబంధిత ప్రయాణికుడికి సురక్షితంగా అందజేయడంలో విధి నిర్వహణలో ఉన్న టికెటు తనిఖీ అధికారి జె.కె.హేంబ్రమ్ గొప్ప మనసు చాటుకున్నారు. 12704 నంబర్ కలిగిన సికింద్రాబాద్ – హౌరా ఫలక్‌నుమా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు బీ/4–63వ నంబర్ బెర్తులో సికింద్రాబాద్ నుంచి ప్రయాణించిన ఎం.పి.రెడ్డి ల్యాప్‌టాప్‌ని మరిచిపోయి కటక్ రైల్వేస్టేషనులో దిగిపోయారు. ల్యాప్‌టాప్ మర్చిపోయిన విషయం గుర్తించే సమయానికి రైలు బయల్దేరింది. ఈ విషయం విధి నిర్వహణలో ఉన్న టికెటు తనిఖీ అధికారి హేంబ్రమ్ దృష్టికి తీసుకెళ్లడంతో గాలింపు చేపట్టారు. ప్రయాణికుని సమాచారం మేరకు ల్యాప్‌టాప్‌ని గుర్తించిన టీటీఐ, ఆగ్నేయ రైల్వే ఖరగ్‌పూర్ రైల్వేస్టేషనులో రైల్వే రక్షక దళానికి (ఆర్‌పీఎఫ్) సురక్షితంగా అప్పగించారు. అక్కడ విధి నిర్వహణలో ఉన్న ఆర్‌పీఎఫ్ సహాయ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.కుమార్‌కు అప్పగించారు. రైలులో మరిచిపోయిన ల్యాప్‌టాప్‌ని ప్రయాణికునికి సురక్షితంగా చేరవేసే ఏర్పాట్లును ఆర్‌పీఎఫ్ వర్గాలు అనుబంధ ఏర్పాట్లు చేస్తారని పేర్కొన్నారు.

సరా గ్రామం సందర్శన

పర్లాకిమిడి: జిల్లాలో కాశీనగర్ సమితిలోని సరా గ్రామంలో డెంగీ, మలేరియా వ్యాధుల బారినపడిన ప్రజలను పరామర్శించడానికి ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు మంగళవారం పర్యటించారు. గ్రామంలో ఇంకా డెంగీ వ్యాధిగ్రస్తులు చికిత్స కోసం పర్లాకిమిడి, శ్రీకాకుళం జిల్లాల్లోని పలు ప్రభుత్వ, ప్రైవేటు క్లినిక్‌లకు వెళ్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆస్పత్రిలో సరైన చికిత్స అందిచాల్సిందిగా జిల్లా ముఖ్య వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్‌కుమార్ పాత్రోను కోరారు.


డెంగీ బాధితురాలిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

‘రక్తదానం మరొకరికి ప్రాణదానం’

శ్రీకాకుళం రూరల్: రక్తదానం మరొకరికి ప్రాణదానమని ఎస్పీ జీఆర్ రాధిక తెలిపారు. మండల పరిధిలోని మునసబుపేటలో గురజాడ విద్యా సంస్థల్లో చేయిచేయి కలుపుదాం అనే స్వచ్ఛంద సేవాసంఘం ఆధ్వర్యంలో మంగవారం రక్తదాన కార్యక్రమం జరిగింది. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గురుపూజోత్సవం రోజున రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. రేపటి తరం గురువులేనని జన్మనిచ్చిన తల్లిదండ్రులను గురువులను జీవితాంతం మర్చిపోరాదన్నారు. కార్యక్రమంలో గురజాడ విద్యాసంస్థల అధినేత జీవీ స్వామినాయుడు, డైరెక్టర్ జీవీ సంయుక్త, ప్రిన్సిపాల్ పులఖండం శ్రీనివాసరావు, చేయిచెయి కలుపుదాం సేవాసంఘం ప్రెసిడెంట్ సీపాన సంతోష్, తదితరులు పాల్గొన్నారు.


ఎస్పీ జీఆర్ రాధికను సన్మానిస్తున్న గురజాడ విద్యాసంస్థ ఉపాధ్యాయులు

క్లుప్తంగా

లారీని ఆటో ఢీకొని ఒకరి మృతి


పాపయ్య మృతదేహం

బొండపల్లి: మండల కేంద్రం బొండపల్లి-చందకపేట గ్రామాల మధ్యలో జాతీయ రహదారి26పై మంగళవారం వేకువ జామున ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఆటో ఢీకొట్టడంతో ప్రమాదంలో ఆటో ప్రయాణికుడు మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి ఏఎస్సై శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దత్తిరాజేరు మండలం పెదకాద గ్రామానికి చెందిన బొద్దాన పాపయ్య(73)తో పాటు బొద్దాన రాము ఆటో డ్రైవర్ బొద్దాన సురేష్‌లు కాయగూరలు విక్రయించేందుకు విజయనగరం వెళ్తుండగా బొండపల్లి-చందక పేట గ్రామాల మధ్యలో ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పాపయ్యను విజయనగరంలోని కేంద్ర సర్వజన ఆస్పత్రికి 108లో తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. అలాగే బొద్దాన రాము పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పార్వతీపురం అసెంబ్లీ ఓట్లపై విచారణ


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ హేమలత

పార్వతీపురంటౌన్: పార్వతీపురం నియోజకవర్గంలో గల 1,87,751 ఓట్లపై విచారణ చేసినట్లు రెవెన్యూ డివిజన్ అధికారి, పార్వతీపురం నియోజకవర్గం ఓటరు నమోదు అధికారి కె.హేమలత అన్నారు. ఓటరు పునశ్చరణపై మంగళవారం పార్వతీపురం నియోజకవర్గం స్థాయిలో రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో 1,87,751ఓట్లు ఉన్నాయని, సీతానగరం మండలం నిడగల్లులో మృతిచెందిన ఓటర్ల పేర్లు జాబితాలో ఉన్నాయని ప్రజాప్రతినిధులు తెలపగా తక్షణమే ఆమె స్పందించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సమావేశం అనంతరం నిడగల్లు గ్రామాన్ని సందర్శించి పరిశీలించారు. నియోజకవర్గంలో గడిచిన వారం రోజుల్లో ఫారం 6కింద 149, ఫారం -7కింద 149, ఫారం -8కింద 125 దరఖాస్తులు అందాయని తెలిపారు. తొలగిస్తున్న ప్రతి ఓటును నిశితంగా పరిశీలించనున్నట్లు చెప్పారు. సమావేశంలో తహసీల్దార్లు, రాజకీయ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓట్ల తొలగింపు పరిశీలన

సీతానగరం: మండలంలోని గుచ్చిమి, నిడగల్లు గ్రామ పంచాయతీల్లో ఓటరు తొలగింపు ప్రక్రియను ఆర్డీఓ హేమలత మంగళవారం పరిశీలించారు. గుచ్చిమిలో 108, 109 పోలింగ్ కేంద్రాల్లో 58 ఓట్ల తొలగింపు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే నిడగల్లులో 115, 116, 117 పోలింగ్ కేంద్రాల పరిధిలో 82ఓట్లు తొలగించగా 116,117 పోలింగ్ కేంద్రాల్లో ఇంకా డెత్‌లు ఉన్నాయని, వాటిని తొలగించాలని ఆదేశించారు.

లైంగికదాడి నిందితుడి అరెస్టు

రాజాం సిటీ: మండల పరిధి గెడ్డవలస గ్రామంలో మహిళపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడు బూరాడ వెంకటరావును అరెస్టు చేశామని సీఐ కె.రవికుమార్ తెలిపారు. మంగళవారం అరెస్టు చేసిన నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించారన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ ప్రసన్న

విజయనగరం ఫోర్ట్: గర్భిణులు మంచి ఆహారాన్ని తీసుకోవాలని సీడీపీఓ ప్రసన్న అన్నారు. పోషకాహార మాసోత్సవాలు సందర్భంగా అయ్యన్నపేట అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. గర్భిణులు మంచి పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకుంటే పుట్టబోయే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చిన పౌష్టికాహారాన్ని సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సైలాడ ఈశ్వరమ్మ, సూపర్‌వైజర్ బి.అనురాధ తదితరులు పాల్గొన్నారు.

108 ఉద్యోగికి ఆర్థిక సాయం

విజయనగరం ఫోర్ట్: 108 ఉద్యోగికి తోటి ఉద్యోగులు ఆర్థిక సాయాన్ని అందించారు. పార్వతీపురం మన్యం జిల్లా జియ్యమ్మవలస 108 అంబులెన్సు పైలెట్‌గా పని చేస్తున్న బి.తవిటినాయుడు తీవ్ర అనారోగ్యంతో విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇతనికి 108 సంస్థలో పని చేస్తున్న పైలెట్లు మంగళవారం ఆస్పత్రికి వెళ్లి రూ.70,300 ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా 108 ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గొర్లె అప్పలనాయుడు, కార్యదర్శి వెంకటరమణ, విజయనగరం జిల్లా అధ్యక్షుడు వేమలి అప్పలనాయుడు, కె.గోపాలం, తదితరులు పాల్గొన్నారు.

‘కౌలు’కుంటున్న రైతులు

- అండగా నిలుస్తున్న ప్రభుత్వం
- రుణాలు, రైతుభరోసా వర్తింపు


పొలానికి నీరు తోడు కౌలు రైతు

విజయనగరం ఫోర్ట్: కౌలు రైతులకు జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. సాధారణ రైతుల మాదిరిగా వారికి కూడా సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. సాగు పెట్టుబడికి ఆర్థిక సాయంతో పాటు పండించిన పంటను కొనుగోలు చేస్తోంది. ముఖ్యంగా కౌలు రైతులకు పంట రుణాలను ఇప్పించి పెట్టుబడికి ఇబ్బందులు పడకుండా ఆదుకుంటోంది. ఏటా కౌలు రైతుల సంఖ్యతో పాటు అందించే ఆర్థిక సాయాన్ని పెంచుతోంది. ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలవడంతో భూమిని కౌలుకు తీసుకుని సాగు చేయడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు.

రైతు భరోసా కింద రూ.1.95 కోట్లు అందజేత

ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని సాధారణ రైతుల మాదిరి కౌలు రైతులకు అందిస్తూ ఏటా ప్రతి కౌలు రైతుకు రూ.7500 చొప్పున విడుదల చేస్తోంది. గత ఏడాది 2111 మందికి రూ.1.58 కోట్లు అందజేయగా ఈ ఏడాది 2603 మందికి రూ.1.95 కోట్లు అందజేసింది.

భూయాజమానులకు ఇబ్బంది లేకుండా

భూయాజమానుల దగ్గర భూమిని కౌలుకు తీసుకుని సాగుచేస్తున్న నిరుపేద రైతులకు దేశంలో ఎక్కడా లేనివిధంగా పంట సాగు హక్కు ధ్రువీకరణ పత్రాలు(సీసీఆర్‌సీ) ఇచ్చి అండగా నిలిచింది. సాధారణ రైతుల మాదిరి వారికి కూడా పంట రుణాలను ప్రభుత్వం అందిస్తోంది. ఈ క్రమంలో ఈఏడాది 299 మంది రైతులకు ఇప్పటి వరకు రూ.85.05 లక్షల పంటరుణాలు ఇచ్చింది.

సాగు ధ్రువీకరణ పత్రాలతో ప్రయోజనాలు

పంట సాగు హక్కు ధ్రువీకరణ పత్రాల (సీసీఆర్‌సీ) వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ప్రభుత్వం అందించే విత్తనాలు, ఎరువులు, పంట రుణాలు పొందవచ్చు. అలాగే పండించిన పంటను విక్రయించుకోవచ్చు. ముఖ్యంగా రైతు భరోసా ఆర్థిక సాయం పొందవచ్చు.

మూడేళ్లుగా వస్తున్న రైతు భరోసా



నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని భూమిని సాగుచేస్తున్నాను. 2021 నుంచి కౌలు చేస్తున్నాను. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం మూడేళ్లుగా రైతు భరోసాను ఇస్తోంది. కౌలు రైతులకు మేలు చేస్తున్న సీఎం జగన్ మోహన్ రెడ్డిని జీవితాంతం గుర్తుంచుకుంటాం.

– మాసాద ప్రసాద్, కౌలు రైతు, పినవేమలిగ్రామం

ఈ ఏడాది ఎక్కువగా సాగు హక్కు పత్రాలు



పంట సాగు హక్కు ధ్రువీకరణ పత్రాలు గత ఏడాది కంటే ఈఏడాది అధికంగా ఇచ్చాం. రైతు భరోసా కూడా ఎక్కువ మందికి ప్రభుత్వం వర్తింపజేసింది. కౌలు రైతులకు అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా నిలుస్తోంది.

– వి. తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి

సామూహిక గృహప్రవేశానికి ఇళ్లు సిద్ధం చేయాలి

- అధికారులకు కలెక్టర్ ఆదేశాలు


జగనన్న కాలనీ లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

బొబ్బిలి: మరో వారం రోజుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించే జగనన్న కాలనీల సామూహిక గృహప్రవేశానికి ఇళ్లను సిద్ధం చేయాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం ఆమె పట్టణంలోని ఐటీఐ కాలనీ వద్ద ఉన్న జగనన్న కాలనీని ఆకస్మికంగా సందర్శించారు. అక్కడి లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వారికి ఏమేం అవసరాలున్నాయో అడిగి తెలుసుకున్నారు. అక్కడి కాలనీ ఆర్చ్ నిర్మాణాన్ని పరిశీలించి త్వరగా నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. కాలనీలోని రోడ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రతి ఇంటికీ ఇంకుడు గుంతలు ఉండాలన్నారు. అలాగే తాగునీటి కోసం తీసుకున్న చర్యలపై ఆరా తీశారు.

ఓటరు జాబితా సరిచేయండి

పాత బొబ్బిలిలో ఇంటింటి సర్వేను తనిఖీ చేసిన కలెక్టర్ నాగలక్ష్మి ఇటీవల పాత బొబ్బిలిలో ఇటీవల చేపట్టిన ఓటరు జాబితా సవరణను తనిఖీ చేశారు. ఓటర్ల ఇళ్లకు వెళ్లి ఓటరు జాబితాలోని తప్పొప్పులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహిళ అరుణ ఫొటో బదులు వేరే వ్యక్తి ఫొటో వచ్చిందని తెలుసుకున్న కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. అలాగే పలు ఇళ్లకు వెళ్లి ఓటరు జాబితాలోని అడ్రసులు, పేర్లను పరిశీలించారు. ఆర్డీఓ పి.శేషశైలజ, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, తహసీల్దార్ డోల రాజేశ్వర రావు, ప్రభుత్వ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి పీలుస్తున్న ముగ్గురి అరెస్టు

విజయనగరం క్రైమ్: గంజాయి పీలుస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు మంగళవారం తెలిపారు. స్థానిక కంటోన్మెంట్ గూడ్స్ షెడ్ వద్ద గంజాయి పీలుస్తూ పట్టుబడిన వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

నేత్రదానంపై అవగాహన కల్పించాలి

రాజాం సిటీ: నేత్రదానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని బొద్దాం పీహెచ్‌సీ వైద్యులు బి.నరేంద్ర, సిద్ధేశ్వరి అన్నారు. నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా బొద్దాం పీహెచ్‌సీలో నేత్రదానంపై మంగళవారం అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ నేత్రదానంపై ప్రజల్లో నెలకొన్న మూఢనమ్మకాలను పారద్రోలాలని, మరణానంతరం ప్రతిఒక్కరూ నేత్రదానం చేసేలా చైతన్యం తీసుకురావాలన్నారు.

ఆగిన లారీని ఢీకొట్టిన ప్రైవేట్ బస్సు

- ఒకరి మృతి,
- 14 మందికి గాయాలు
- ఆరు నెలల చిన్నారి పరిస్థితి విషమం


బస్సులో ఇరుక్కుని మరణించిన రమేష్


మృతుడు రమేష్ (ఫైల్)


తలకు బలమైన గాయాలైన ఆరు నెలల చిన్నారి మోక్షిత్


ఆస్పత్రిలో క్షతగాత్రులు

నక్కపల్లి (అనకాపల్లి జిల్లా): జాతీయరహదారిపై నక్కపల్లి సమీపంలో ఆగి ఉన్న లారీని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో సోమవారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరో 14 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. డ్రైవర్ మితిమీరిన వేగంతో బస్సును నడపడం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పార్వతీపురం నుంచి గుంటూరు వెళ్తున్న సాయికృష్ణ ప్రైవేట్ ట్రావెల్ బస్సులో వేర్వేరు ప్రాంతాలకు వెళ్లేందుకు సుమారు 40 మంది ప్రయాణిస్తున్నారు. వారంతా పార్వతీపురం, బొబ్బిలి, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లిలలో బస్సు ఎక్కారు. బస్సు అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో నక్కపల్లి దాటిన తర్వాత కిలోమీటరు దూరంలో మనబానవానిపాలెం రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. అనకాపల్లిలో జరిగిన వివాహానికి హాజరై తిరిగి వెళ్తున్న విజయవాడ సమీపంలో గొల్లపూడి గ్రామానికి చెందిన బైపాన రమేష్ (35) బస్సులోనే చిక్కుకుని ఈ ప్రమాదంలో మరణించారు. ఇదే ప్రమాదంలో ఆయన భార్య బైపాన కుమారి, కుమారుడు మోక్షిత్ (ఆరు నెలలు)తోపాటు 14మంది గాయపడ్డారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లలో నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. స్వల్ప గాయాలైన వారిని ప్రాథమిక చికిత్స అనంతరం వారి ప్రాంతాలకు పంపించారు. ఆరు నెలల మోక్షిత్ తలకు బలమైన గాయాలై పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం విశాఖ తరలించారు. సంఘటన స్థలాన్ని నర్సీపట్నం ఏఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా, నక్కపల్లి సీఐ అప్పన్న పరిశీలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారి నుంచి వివరాలు సేకరించారు. మృతుడి భార్య కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాదంలో గాయపడిన వారి వివరాలు

గొర్ల బలరామం (దేవరపల్లి, బొబ్బిలి), ఎ.గణేష్‌కుమార్ (పార్వతీపురం), ఎస్.వెంకటవరప్రసాద్ (బొబ్బిలి), చిలకంట నరేంద్ర (బెంగళూరు), చంద్ర (బెంగళూరు), అల్లు శాంతారాం (పార్వతీపురం), గొల్ల శిరీష (పార్వతీపురం), ముప్పాల వర్షిత (బొబ్బిలి), మున్నం దేముడమ్మ (పెందుర్తి), ఆకోటి ధరణి (సాలూరు) అల్లు సావిత్రమ్మ (పార్వతీపురం), పి.కోటేశ్వరమ్మ (పార్వతీపురం)

ఉపాధ్యాయులు దేశానికి వెన్నెముక

- వీసీ ప్రొఫెసర్ తేజస్వి కట్టిమణి
- ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం


కేంద్రియ గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీకట్టిమణిని సత్కరిస్తున్న యూనివర్సిటీ సిబ్బంది


సీతం ఇంజినీరింగ్ కళాశాలలో సత్కారం పొందుతున్న సెంచూరియన్ యూనివర్సిటీ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్‌రాజు


సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి నివాలు అర్పిస్తున్న జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ

విజయనగరం అర్బన్: దేశాభివృద్ధికి ఉపాధ్యాయులు కీలక పాత్రవహిస్తున్నారని దేశానికి వారు వెన్నెముక లాంటి వారని కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీకట్టిమణి అన్నారు. ఈ మేరకు స్థానిక కేంద్రీయ గిరిజన యూనివర్సిటీలో మంగళవారం నిర్వహించిన ఉపాధ్యాయుల దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత దివంగత రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ ఉపాధ్యాయులకే వన్నె తెచ్చిన మహోన్నత వ్యక్తి అని, అటువంటి మహనీయుని అడుగుజాడలలో నేటి ఉపాధ్యాయులు నడవాలని సూచించారు. అనంతరం యూనివర్సిటీ అధ్యాపక బృందం వీసీని ఘనంగా సత్కరించింది. యూనివర్సిటీ డీన్స్ ప్రొఫెసర్ శ్రీనివాసన్ తంత్రవాహి, ప్రొఫెసర్ జితేంద్ర మోహన్ మిశ్రా, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ ఏఎస్.బీ.కివడే తదితరులు ఉపాధ్యాయ వృత్తి ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ జీవీలో

నగరంలోని జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగింది. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుడు మంచి సమాజాన్ని తయారు చేసే గొప్ప సాధనమని అన్నారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్ది కార్యోన్ముఖుల్ని చేసి గొప్ప శక్తి టీచర్ అని కొనియాడారు. అనంతరం పలువురు అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీకుమార్, యూనివర్సిటీ డైరెక్టర్లు, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతం ఇంజినీరింగ్ కళాశాలలో..

స్థానిక గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సెంచూరియన్ యూనివర్సిటీ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్‌రాజును సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీరామమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే తోటపాలెంలోని సత్య డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీసాయిదేవమణి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం జరిగింది.

పైడితల్లికి ప్రత్యేక అలంకరణ


చదురుగుడిలో పుష్పాలంకరణలో అమ్మవారు


వనంగుడిలో గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు



అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు చదురుగుడిలో మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే వనంగుడిలో అమ్మవారిని గాజులతో అలంకరించారు. చదురుగుడి ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు శాస్త్రోక్తంగా అమ్మవారికి పూజలు చేశారు. అమ్మవారికి ప్రీతికరమైన బూరెలతో నివేదన చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించుకుని పసుపు,కుంకుమలు చెల్లించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ఈఓ కేఎల్.సుధారాణి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

మడ్డువలసకు జలకళ

- ప్రాజెక్టులోకి చేరుతున్న నీరు
- ఆనందంలో రైతులు


జలకళతో మడ్డువలస ప్రాజెక్టు


ప్రాజెక్టు వద్ద 63.50 మీటర్ల లెవెల్ నమోదైన దృశ్యం

వంగర: మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు ఇప్పుడిప్పుడే నీటితో జలకళ సంతరించుకుంటోంది. ప్రాజెక్టు వద్ద గేట్లు మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.1.80 కోట్ల నిధులు మంజూరు చేయడంతో ఈ ఏడాది మార్చిలో ప్రాజెక్టులో నీటిని ఖాళీ చేశారు. దీంతో ప్రాజెక్టులో నీటిమట్టం డెడ్‌స్టోరేజ్(58.02 మీటర్లు లెవెల్)కి చేరుకుంది. జూలై చివరి నాటికి ప్రాజెక్టు వద్ద పనులు పూర్తి చేయడంతో ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ ద్వారా ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేశారు. జూలై చివరి నాటికి 59 మీటర్ల నీటినమట్టం నమోదైంది. అప్పటి నుంచి ప్రాజెక్టు ఎగువన ఉన్న సువర్ణముఖి, వేగావతి నదుల నుంచి స్వల్పంగా నీటి ప్రవాహం పెరగడంతో ఇప్పుడు వెయ్యి క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ప్రాజెక్టులోకి చేరుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టు వద్ద 63.50 మీటర్ల నీటి నిల్వ ఉంది. ప్రాజెక్టు మొత్తం నీటిమట్టం 65 మీటర్లు లెవెల్ కాగా 3.33 టీఎంసీల నీటి నిల్వ ఉండాల్సి ఉంది. ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురుస్తుండడంతో ప్రాజెక్టు నిండడానికి చాలా సమయం పట్టింది. ఆశాజనకంగా వర్షాలు కురిస్తే మరో పదిహేను రోజుల్లో నదుల్లో ఇన్‌ఫ్లో పెరిగి ప్రాజెక్టు నిండుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ ప్రస్తుతం ప్రాజెక్టులో 1.77 టీఎంసీ నీరు నిల్వ ఉండడంతో ఆయకట్టు భూముల్లో పంటలు సాగుకు ఎటువంటి ఇబ్బంది ఉండదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

8న పోలమాంబ సన్నిధిలో సామూహిక కుంకుమ పూజ

మక్కువ: ఉత్తరాంధ్ర ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి ఆలయంలో ఈ నెల 8న సామూహిక కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ రాధాకృష్ణ మంగళవారం తెలిపారు. నాల్గవ శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని, వేదపండితుల మంత్రోచ్చరణలతో అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించనున్నామన్నారు. కుంకుమ పూజలో పాల్గొనే భక్తులుకు దేవదాయ శాఖ తరఫున పసుపు, కుంకుమ, గాజులు అందివ్వనున్నట్లు తెలిపారు.

ఆటోడ్రైవర్ల సంక్షేమ బోర్డుకు వినతి



కోట వద్ద నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

విజయనగరం పూల్‌బాగ్: ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎ.జగన్‌మోహన్‌రావు, బి.రమణ డిమాండ్ చేశారు. జిల్లా ఆటోవర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక కోట వద్ద మంగళవారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరంతరం పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలతో డ్రైవర్లంతా ఇబ్బంది పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రవాణా రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టపెట్టేందుకు మోదీ మోటారు వాహనచట్టం – 2020లో సవరణలు చేశారని, వీటి రద్దు కోసం దేశవ్యాప్త ఆందోళనకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగా ఈ నెల 16, 17 తేదీల్లో రాష్ట్ర వర్క్‌షాప్ కర్నూల్లో నిర్వహిస్తున్నామని, అక్టోబర్ 6న చలో రాజభవన్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు కంది త్రినాథ్, లక్ష్మణ్‌దొర, రామారావు, సురేష్, తిరుపతిరావు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో వైద్య శిబిరం


వైద్య శిబిరాన్ని సందర్శించిన కలెక్టర్ నాగలక్ష్మి, డీఆర్‌ఓ గణపతిరావు

విజయనగరం అర్బన్: కలెక్టర్ ఆదేశాల మేరకు మిమ్స్ వైద్య నిపుణులు కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న వివిధ శాఖల ఉద్యోగ, అధికారులు సుమారు వంద మంది శిబిరంలో పాల్గొన్ని వైద్య పరీక్షలను చేయించుకున్నారు. శిబిరాన్ని కలెక్టర్ నాగలక్ష్మి ఎస్, డీఆర్‌ఓ ఎం.గణపతిరావు సందర్శించారు.

గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి


ద్వారం దుర్గాప్రసాదరావును సత్కరిస్తున్న అకాడమీ నిర్వాహకులు

విజయనగరం టౌన్: సంగీతం నేర్చుకుంటున్న ప్రతి ఒక్కరూ లైబ్రరీని సద్వినియోగం చేసుకోవాలని ప్రఖ్యాత వయోలిన్ విద్వాంసులు ద్వారం దుర్గాప్రసాదరావు అన్నారు. స్థానిక కొత్తగ్రహారంలో ఉన్న రోటరీ ద్వారం నరసింగరావు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో నడపబడుతున్న మ్యూజిక్ అకాడమీలో మంగళవారం ద్వారమ్స్ పేరుతో లైబ్రరీని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ దినోత్సవం రోజున లైబ్రరీని ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం నిర్వాహకులు ఆయన్ను దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అకాడమీ ప్రిన్సిపల్ మండపాక రవి, ఎ.పద్మప్రియ, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.